RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

4 ANNIVERSARY

వరంగల్
సంపుటి : 4, సంచిక : 02

మంగళవారం
డిసెంబర్ 02 , 2025


పేజీలు : 6
వెల : రూ.3-00

DECEMBER 01 2025

ANNIVERSARY CELEBRATIONS 4th ANNIVERSARY

వేద న్యూస్ దినపత్రిక

# ధైర్యమే ఆయుధం.. విశ్వసనీయతే అస్త్రం..



## మూడేండ్ల ప్రయాణం నిప్పుల మీద నడకనే..

## ఈ జర్నీలో అండగా నిలిచిన అందరికీ శనార్తులు

సోషల్ మీడియా వ్యాప్తి విపరీతంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో విశ్వసనీయమైన సమాచార చేరవేత ప్రశ్నార్థకంగా మారింది. ఏది నిజం? ఏది అబద్ధం? అనేది తెలుసుకునే లోపే న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. అప్పటికే జరగాల్సినంత నష్టం జరిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం, ప్రజా కోణంలో వార్తల సేకరణ, ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ.. పత్రిక నిర్వహణ నిప్పుల మీద నడకలా కొనసాగుతోంది.! అయినా జర్నలిజం సమాజం కోసం, సమాజంలో మంచిని పెంపొందించడం కోసం పని చేయాలనే సూత్రాల ఆధారంగా మేము ముందుకు సాగుతున్నాం. ఈ ప్రయాణం మాకు ముళ్ల కంప మీద నడుస్తున్నట్టుగానే ఉన్నది.

*ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా 'పత్రిక'.. ప్రతిపక్షంగా ఉంటూ .. ప్రతీ 'పక్షం' సమాచారం ప్రభుత్వానికి చేరవేస్తూ.. ప్రజా సమస్యలను ప్రముఖంగా ప్రచురిస్తూ ముందుకు సాగాలనే మహత్తర లక్ష్య సాధనలో 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక తన వంతు పాత్రను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తోంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ..సమస్యల ప్రచురణలో వెనకడుగు వేయకుండా దూసుకెళ్తోంది.* ఈ క్రమంలో పత్రిక ఆర్థిక నిర్వహణ అత్యంత భారంగా మారింది. ప్రతీ రోజూ సమయ పాలన పాటించడం, ముఖ్యంగా వార్తల సేకరణకు విలేకరులకు సమయాభావం, డెస్క్‌తో సమన్వయం డెడ్‌లైన్ కత్తి వేలాడుతూ ఉండటం.. ఎన్నో రకాల నిర్వహణ సమస్యలున్నా ఎంతో ఓపికతో నిత్యం.. పత్రిక ప్రచురణ విషయమై సంపాదకవర్గం, డిజైనర్ల చొరవతో పత్రికను ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికి పడిన శ్రమ అనిర్వచనీయం. ఎంతో అందంగా తీర్చిదిద్దితే కానీ ప్రస్తుతం పాఠకలోకం ఆదరించే పరిస్థితి లేదు. కావును ప్రత్యేక శ్రద్ధ వహించి మరీ 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక నిర్వహణపై తొలినాళ్లలో అత్యంత చొరవ తీసుకుని ముందుకు సాగాం. అయితే, తదనంతర సమయంలో కొంత ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. ఈ సమయంలోనే మాకు కొంత మేరకైనా అండగా నిలిచిన వారిని మర్చిపోం.. అక్షర సైనికులుగా మా వద్ద తర్ఫీదు పొందిన వారు మరింతగా రాణించాలని భావించే సహృదయతతో కొందరి నిర్ణయాలను మేం కాదనలేదు. అయితే, *ఈ మూడేండ్ల నిప్పుల నడక వంటి మా ప్రయాణంలో అనుక్షణం మా వెంట నిలిచి.. మమ్ములను ముందుకు నడిపించింది.. పాఠకుల ప్రేమ, ఆదరాభిమానాలు మాత్రమే. ప్రకటనకర్తలు, సాధారణ పాఠకులు, ప్రజలు అందరి అండదండలతో మేం ఇంత దూరం వరకు రాగలిగాం. 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక మూడు వసంతాలు పూర్తి చేసుకుని.. నాలుగో వసంతంలోకి అడుగెడుతున్న సందర్భంగా మా విలేకరులు, సిబ్బందితో పాటు పాఠకులకూ శుభాకాంక్షలు తెలుపుతున్నాం.* ఇక ముందు కూడా మేము..ధైర్యమే ఆయుధంగా.. విశ్వసనీయతే అస్త్రంగా కలం కవాతు చేస్తూ.. పాఠకుల ఆదరణ, ఆదరాభిమానాలు మరింతగా పొందేందుకు తప్పక ప్రయత్నిస్తాం..

**లింగబత్తిని కృష్ణ**
'వేద న్యూస్' తెలుగు దినపత్రిక సంపాదకులు,
సెల్:97019 23260

# ‘మేడారం’ పెద్ద బాధ్యత

- అభివృద్ధి పనుల్లో అంకితభావం తప్పనిసరి
- ఆఫీసర్లు దగ్గరుండి పర్యవేక్షించాలి
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: సీఎం రేవంత్



**వేద న్యూస్, హైదరాబాద్ :**

మేడారం జాతరకు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఏ మాత్రం రాజీ లేకుండా నాణ్యమైన పనులు జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ఇంజినీర్లు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రతి పనిని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**

పనుల్లో నిర్లక్ష్యం, నాణ్యత లోపం ఏదైనా కనిపిస్తే సంబంధిత శాఖలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మేడారం అభివృద్ధి కేవలం ఒక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కాదని, అది కోట్లాది భక్తుల విశ్వాసానికి సంబంధించిన పెద్ద బాధ్యత అని సీఎం తెలియజేశారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేడారం అభివృద్ధి ప్రగతిపై అధికారులిచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు అంశాలపై ప్రత్యేక సూచనలు చేశారు. రహదారుల విస్తరణ, రాతి పనులు, కొత్త మార్గాల రూపకల్పన, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకల ఏర్పాట్లు ఇవి పూర్తి సమన్వయంతో జరగాలని ఆయన ఆదేశించారు. వేలాదిమంది భక్తులు వచ్చే ప్రాంతాల్లో చిన్నపాటి పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని సీఎం హెచ్చరించారు.

**సమగ్ర ప్రణాళికలతో వర్క్ చేయండి**

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైటింగ్ సిస్టమ్, డ్రైనేజ్ నిర్వహణ, పార్కింగ్ ప్రాంతాల ప్రణాళిక వంటి అంశాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే జాతర సందర్భంగా రద్దీ అత్యంత తీవ్రమై ఉంటుంది కాబట్టి, అన్ని శాఖలు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని ఆయన చెప్పారు. ఆర్ అండ్ బీ, దేవాదాయ, అటవీ, విద్యుత్ శాఖలతో పాటు స్థపతి శివనాగిరెడ్డి కలిసి ప్రాజెక్ట్ ప్రతి దశనూ సమన్వయం చేయాలని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు. పనుల వేగం పెంచేందుకు అవసరమైన వనరులను వెంటనే అందుబాటులోకి తేవాలని కూడా ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం అభివృద్ధిలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టంగా తెలిపారు. మేడారం జాతర కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా, తెలంగాణ సంస్కృతికి గుర్తింపుగా నిలిచే పెద్ద పండుగ అని గుర్తుచేశారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీ ఆచారాలకు ఏ విధంగా కూడా భంగం కలగకుండా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువులోపే అన్ని పనులు పూర్తి కావాలని తేల్చిచెప్పిన సీఎం, ఆలస్యం జరిగే పరిస్థితుల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. మేడారం అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం, ప్రతి భక్తుడికి తగిన సౌకర్యాలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యంగా పేర్కొన్నారు.

## హైదరాబాద్ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టులు

- హెచ్ యూ డి సి ఓ చైర్మన్‌తో సీఎం రేవంత్ సమావేశం
- భారత భవిష్యత్ నగరం, మేట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్‌పై కీలక చర్చలు
- తక్కువ వడ్డీ రుణాల కోసం సీఎం విజ్ఞప్తిపాత భారీ రుణ భారం తగ్గించేందుకు పునర్వ్యవస్థీకరణ చర్చ
- ఇందిరమ్మ ఇళ్లకు రుణాలు మంజూరుఇంకా 10 లక్షల ఇళ్లకు వెంటనే రుణాలివ్వనున్నట్టు హెచ్ యూ డి సి ఓ హామీ



3లో..

## సరిహద్దుల భద్రతలో అగ్రగామి బీఎస్ఎఫ్

- 61వ వార్షికోత్సవం సందర్భంగా సంకల్ప పునరుద్ధరణ
- దేశ సరిహద్దుల కాపాడటంలో అచంచల సేవ
- పశ్చిమ - తూర్పు సరిహద్దులపై నిరంతర అప్రమత్తత
- జాతీయ నిర్మాణంలో బీఎస్ఎఫ్ కీలక పాత్ర



**వేద న్యూస్ డెస్క్:**

సరిహద్దు భద్రతా దళం 61వ వార్షికోత్సవం సందర్భంగా దేశ సరిహద్దుల రక్షణలో తమ అచంచలమైన సంకల్పాన్ని మరోసారి పునరుద్ధరించింది. సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహించే వీర రక్షకులు ‘సీమా ప్రభరి’దేశ భద్రత కోసం రాత్రింబగళ్లు అప్రమత్తంగా ఉండి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారని సంస్థ తెలియజేసింది. దేశ భౌగోళిక సమగ్రత కాపాడటమే తమ ప్రధాన ధ్యేయమని వారు మరొకసారి స్పష్టం చేశారు. బీఎస్ఎఫ్ దేశం యొక్క ప్రముఖ భద్రతా బలగంగా, ముఖ్యంగా పశ్చిమ మరియు తూర్పు సరిహద్దుల్లో విస్తరించిన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటోంది. అక్రమ చొరబాట్లు, ఆయుధాల అక్రమ రవాణా, డ్రగ్స్ మరియు ఇతర నిషేధిత చట్రాలను అరికట్టడం వంటి అనేక కఠిన విధులను ఈ దళం నిర్వర్తిస్తోంది. సరిహద్దు వెంబడి ప్రతి అంగుళాన్ని కాపాడాలనే లక్ష్యంతో బీఎస్ఎఫ్ నిరంతరం గస్తీ నిర్వహిస్తూ బలగాల క్రమశిక్షణను ప్రతిబింబిస్తున్నారు. దేశ నిర్మాణంలో తమ పాత్రను గుర్తుచేసుకుంటూ బీఎస్ఎఫ్ దేశానికి తొలి రక్షణ గోడగా నిలిచిందని అధికారులు తెలిపారు. విభిన్న రాష్ట్రాల్లో జరుగుతున్న అంతర్గత భద్రతా కార్యకలాపాల్లో కూడా బీఎస్ఎఫ్ కీలకంగా పనిచేస్తోంది. ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో పౌరుల రక్షణలోనూ ఈ దళం ముందుంటూ తన సేవలను అందిస్తోంది. దేశ శక్తివంతతలో సరిహద్దుల భద్రత ఎంత ముఖ్యమో ప్రజలకు నిరంతరం వివరిస్తోందని అధికారులు పేర్కొన్నారు. 61 సంవత్సరాల సేవలో బీఎస్ఎఫ్ అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ తమ ధైర్యసాహసాలు, పటిష్ట దృఢత, దేశపట్ల అంకితభావం ఎప్పుడూ తగ్గలేదని సంస్థ తెలిపింది. సీమా ప్రభరి దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్నారని, వారి సేవలను దేశం ఎప్పటికీ మరవదని అధికారులు అన్నారు. సరిహద్దుల భద్రతను మరింత బలపరచేందుకు, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ముందుకు సాగడమే తమ లక్ష్యమని బీఎస్ఎఫ్ ప్రతిజ్ఞ చేసింది.

## రైతుబంధు, రుణమాఫీపై కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్

- హరీశ్‌రావు ఆగ్రహం
- రైతుల మీద వ్యతిరేక విధానాలు అమల చేస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు
- రైతుబంధును ఒకే పంటకు కుదించే యత్నాన్ని హరీశ్‌రావు ఖండన



**సంగారెడ్డి, వేద న్యూస్:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తెలంగాణ ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, పంటల కొనుగోలు ఈ మూడు ముఖ్య అంశాల్లోనూ రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలతో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా మరచిపోయిందని ఆరోపించారు. పంటకు ఎప్పటికప్పుడు మద్దతు ఇవ్వాల్సిన సమయంలో, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం రైతులను సంక్షోభంలోకి నెట్టుతోందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు మూడు పంటలకు రైతుబంధు అందజేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, కానీ ఇప్పుడు దానిని ఒకే పంటకు కుదించేందుకు కుట్ర సాగుతోందని ఆయన ఆగ్రహించారు. సుమారు 70 లక్షల ఎకరాల్లో పెరుగుతున్న

3లో.

## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- ఐపీఎస్ అధికారులను ఐఏఎస్ కేడర్‌లోకి తీసుకోవడం చట్టబద్ధమా? కోర్టు ప్రశ్న
- జీవో 1342పై వడ్ల శ్రీకాంత్ పిటిషన్‌నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణ
- డిసెంబర్ 10లోపు వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీకి హైకోర్టు ఆదేశాలు



**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలో ఐపీఎస్ అధికారులను ఐఏఎస్ హోదాలో కొనసాగించడంపై ఏపీ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా శిఖా గోయెల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర వంటి సీనియర్ ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ సమాన హోదా ఎందుకు ఇచ్చారన్న విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది. ఐపీఎస్ కేడర్, ఐఏఎస్ కేడర్ రెండు వేర్వేరు పరిపాలనా వ్యవస్థలకు చెందినవైనా, వాటిని కలిపి చూడడం చట్టపరంగా ఎక్కడికి పడుతుందన్న ప్రశ్నను కూడా కోర్టు లేవనెత్తింది. సెప్టెంబర్ 26న విడుదలైన జీవో 1342పై వడ్ల శ్రీకాంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ జీవో ప్రకారం కొంతమంది ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ స్థాయి పదవులు ఇచ్చినట్లు ఆరోపించారు. ఇది ఆల్ ఇండియా సర్వీసెస్ నిబంధనలకు వ్యతిరేకమని, హోదాల కేటాయింపులో కేంద్ర నియమాలు పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేడర్ నియమాలను మార్చే అధికారం లేదని, ఇలాంటి నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే చేయాలని పిటిషన్ పేర్కొన్నది. ఈ పిటిషన్ విచారణలో కోర్టు, ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలు చూపాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తి సూరేపల్లి నంద ఆధ్వర్యంలోని ధర్మాసనం, ఈ ప్రక్రియలో ఏ నిబంధనలను ఆధారంగా తీసుకున్నారో స్పష్టంగా వివరించాలని కోర్టు ప్రశ్నించింది. ఐపీఎస్ అధికారులు తమ కేడర్లోనే కొనసాగాలి, వారికి ఐఏఎస్ హోదా ఇవ్వడం పరిపాలనా వ్యవస్థలో గందరగోళం సృష్టించే అంశమని కోర్టు సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా హోదా మార్పులు జరిగితే, భవిష్యత్తులో నియామకాలపై, పదోన్నతులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై డిసెంబర్ 10లోపు పూర్తి వివరణ ఇవ్వాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జీవోపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం ఏమిటి, హోదా కేటాయింపులు ఏ ప్రాతిపదికన జరిగాయి, కేడర్ నియమాలను ఎలా అమలు చేశారు. విషయాల్లో స్పష్టత తీసుకురావాలని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వ సమాధానం వచ్చిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ చేపడతామని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చే వివరణపై ఆధారపడి ఈ కేసు మరింత కీలక దశలోకి వెళ్లే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

# హైదరాబాద్ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టులు

**వేద న్యూస్, హైదరాబాద్:**



తెలంగాణ భవిష్యత్ దిశను నిర్ణయించేందుకు రూపొందుతున్న 'తెలంగాణ రైజింగ్ 2047' దృష్టిపత్రంపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, హెచ్ యూ డి సి ఓ చైర్మన్ సంజయ్ కుల్శ్రేష్ఠతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర అభి వృద్ధిని వేగవంతం చేసే పలు కీలక ప్రాజెక్టుల అంశాలను సీఎం వివరించారు. అభివృద్ధి పనులకు అవసరమైన రుణాలు తక్కువ వడ్డీపై లభిస్తే రాష్ట్ర ప్రగతి మరింత వేగంగా సాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి దిశ, రాబోయే కీలక ప్రాజెక్టులపై విశ్లేషణ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత భవిష్యత్ నగరం, హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రాడియల్ రోడ్లు వంటి ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలకు హెచ్ యూ డి సి ఓ తక్కువ వడ్డీ రుణాలు ఇవ్వాలని కోరారు. రాబోయే దశాబ్దాల్లో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్టులు కీలకమని చెప్పారు. సాధారణ కుటుంబాల నుండి వ్యాపార రంగం వరకు ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలను మెరుగుపరచే ప్రాజెక్టులే ఇవని ఆయన అభిప్రాయపడ్డారు. సీఎం మరో ముఖ్య అంశాన్ని సమావేశంలో ప్రస్తావించారు. గత ప్రభుత్వ కాలంలో తీసుకున్న భారీ వడ్డీ రుణాల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిందని తెలిపారు. ఈ వడ్డీ భారం తగ్గించేందుకు రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని హెచ్ యూ డి సి ఓకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణను బలోపేతం చేసే దిశగా ఇది ముఖ్య అడుగు అవుతుందని సీఎం చెప్పారు. ఇందిరమ్మ గృహాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. హెచ్ యూ డి సి ఓ చైర్మన్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే రుణాలు మంజూరు చేసినట్లు సీఎంను సమాచారం ఇచ్చారు. అదేవిధంగా నూతనంగా నిర్మించబోయే 10 లక్షల ఇళ్లకు తక్షణమే రుణాలు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. పేదలకు గృహాలు అందించే రాష్ట్ర ప్రభుత్వ భారీ కార్యాచరణకు ఇది కీలక మద్దతు అవుతుంది. సీఎం రేవంత్ రెడ్డి, డిసెంబర్ 8%-%9 తేదీల్లో భారత భవిష్యత్ నగరంలో జరగనున్న 'టీ ఆర్ గ్లోబల్ సమ్మిట్'కు హెచ్ యూ డి సి ఓ చైర్మన్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర దిశను ప్రపంచానికి చూపే ఈ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. రాబోయే దశలో తెలంగాణ పురోగతిని నిర్ణయించే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక సంస్థల సహకారం అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు.

# రైతుబంధు, రుణమాఫీపై కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్

దీర్ఘకాలిక పంటలకు నగదు ఎగ్గొట్టే యత్నం జరుగుతోందని తీవ్రంగా మండిపడ్డారు. అదేవిధంగా, సోయా, మక్క పంటలను కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిందని, అయితే 48 రోజులు గడిచినా ఒక్క రూపాయి కూడా రైతులకు అందలేదని ఆరోపించారు. గత యాసంగికి సంబంధించిన రూ. 1,150 కోట్ల సన్న వడ్ల బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను నిలిపివేయడం వల్ల ఆ ప్రాంత రైతులకు నిరాశ కలిగిందని ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టుల పనులను వెంటనే పునఃప్రారంభించకపోతే తాను పాదయాత్ర చేపట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నారాయణఖేడ్‌లో కొత్తగా ఆమోదించిన ఎనిమిది చెరువుల భూసేకరణ పూర్తయినా, పనులు మొదలు పెట్టకపోవడం గంభీర వైఫల్యమని వ్యాఖ్యానించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అనంతసాగర్, సిర్గాపూర్ గ్రామాల్లో జరిగిన మల్లన్న జాతర కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆందోళన కలిగించే విషయమని, రైతుల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం మాటలు ఒకటిగా, చర్యలు మరోలా ఉండకూడదని, ఎన్నికల హామీలను గౌరవించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం కాపాడాలంటే రైతులకు సరైన మద్దతు, సమయానికి సహాయం తప్పనిసరిగా చేయాలన్నది ఆయన సందేశం.

# యువతీపై కెమికల్ దాడి..!

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



కాజీపేట మండలం కడిపికొండ గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువతిపై గుర్తు తెలియని వ్యక్తులు కెమికల్ తో దాడి చేసిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఓగ్లాపూ ర్ గ్రామానికి చెందిన యువతి హన్మకొండలోని ఓ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాలకు వెళ్లి అమ్మమ్మ ఊరు వెంకటాపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. ఈ క్రమంలో కడిపికొండ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు యువతి రాక కోసం కాపు కాసి కెమికల్ తో దాడి చేశారు. ఈ దాడిలో యువతీకి గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు అంబులెన్స్ లో ఎంజీఎంకి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శామీర్పేట్ పోలీస్ స్టేషన్‌కు జాతీయ స్థాయి గౌరవం

**హైదరాబాద్, వేద న్యూస్ :**




దేశంలోని అత్యుత్తమ పోలీస్ స్టేషన్ల ర్యాంకింగ్లో శామీర్పేట్ పోలీస్ స్టేషన్ అద్భుత ప్రదర్శనతో జాతీయస్థాయిలో ఏడవ స్థానాన్ని, తెలంగాణలో మొదటి స్థానాన్ని సాధించింది. గృహ మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ ర్యాంకింగ్లో శామీర్పేట్ పోలీస్ స్టేషన్ సేవా నాణ్యత, ప్రజా సమస్యల పరిష్కారంలో సమయపాలన, స్టేషన్ పరిశుభ్రత వంటి విభాగాల్లో అత్యుత్తమంగా నిలిచిందని సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. పౌర సేవల విషయంలో శామీర్పేట్ పోలీస్ స్టేషన్ అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును గౌరవంగా స్వీకరించడం, సమస్యను వెంటనే పరిశీలించి పరిష్కరించే విధానం ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతోందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ప్రవర్తన, క్రమశిక్షణ, తక్షణ స్పందన వంటి అంశాలు కూడా ఈ విజయానికి కారణమయ్యాయని అధికారులు అభిప్రాయపడ్డారు. స్టేషన్ పరిశుభ్రత, నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థలు ఈ స్టేషన్‌ను ఇతర స్టేషన్లతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెట్టాయని అధికారులు తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం, స్పష్టమైన మార్గదర్శకాలు అందించడం వల్ల స్టేషన్‌పై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకొని సేవలను మెరుగుపరుస్తుండటం కూడా శామీర్పేట్ పోలీస్ స్టేషన్ ప్రత్యేకతగా నిలుస్తోం

# కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు

## – దళిత బంధు పోరాట సమితి సభ్యుడు కోడెపాక రక్షిత్

**వేద న్యూస్, జమ్మికుంట:**

దళిత బంధు రెండో విడత నిధులు జమ్మికుంట మండల పరిధిలోని లబ్ధిదారులకు అందనందున, మండలంలోని దళితబంధు రాని బాధితులు, దళితులు ఎవరూ కాంగ్రెస్ పార్టీకి ఓటేయొద్దని దళిత బంధు పోరాట సమితి సభ్యుడు కోడెపాక రక్షిత్ కోరారు. సోమవారం ఆయన స్థానిక జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. రానున్న రోజుల్లో పోరాట సమితి సభ్యులు జమ్మికుంట మండలం లోని ఊరురా దళితవాడలో తిరిగి ఈ మేరకు ప్రచారం చేస్తామని చెప్పారు. దళిత బంధు యూనిట్లు నష్టపోయి ఉన్న తమ దళిత కుటుం బాల మీద విచక్షణరహితమైన వెరిఫికేషన్ అనే గుదిబండ ఎందుకు? అని ప్రశ్నించారు. రెండో విడత దళిత బంధు నిధులను హవాలా నిధులని, పుణ్యానికి వచ్చిన పైసలు అని కుసంస్కారంతోని కులహంకారంతోని మాట్లాడే కొందరికి ఒకటే చెబుతున్నాం ..వేల సంవత్సరాల తరబడి వెలివే యబడ్డ జాతులం, 79 సంవత్సరాల స్వతం త్ర భారతదేశంలో మొట్టమొదటిసారి 100 శాతం సబ్సిడీ స్కీమ్ రావడం ఈ హుజురాబాద్ నియోజ కవర్గం దళితుల అదృష్టం అని చెప్పారు. ఈ డబ్బులు మీ ఇంట్లో నుంచి మీ బీరువాలో నుంచి డబ్బు తీసి ఈ నిధుల రూపకంగా మాకు ఇవ్వ ట్లేదని, ఇకపైన ఎవరైనా తప్పుడు కూతలు కూస్తే తగు రీతిలో సమాధానం చెప్తామని హెచ్చరిం చారు.



'దళిత బంధు' వచ్చిందనే సాకుతో ఇంది రమ్మ ఇల్లు, రాజీవ్ వికాసం లాంటి స్కీములు దళితులకు ఈ గవర్నమెంట్ ఇవ్వట్లేదని, దానని తీవ్రంగా ఖండిస్తున్నామని, పునరాలోచన చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ స్కీములు ఇవ్వాలని మనవి చేశారు.

# మహనీయుడి స్మారక సభ విజయవంతం చేయాలి

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో సామాజిక ఉద్యమ కారుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సావనపెల్లి రాకేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా"బి. ఆర్. అంబేద్కర్ ఈ నెల 6న, వర్ధంతి సందర్భంగా దళిత బహుజన అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడిని స్మరించుకోవడానికి మండల కేంద్రంలో ఈ నెల 6న, దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మారక సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్మారక సభ కార్యక్రమానికి జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు మేధావులు హాజరు కానున్నారని అన్నారు. సామాన్యుడికి రాజ్యాంగం ఎలా ఉపయోగ పడు తుందో వివరిస్తూ రాజకీయ అధికారం రాజ్యాంగాన్ని ఎలా ఉపయోగిం చాలో పల్లె పల్లె కు రాజ్యాంగ ఫలాలు అందేలా అందరినీ చైతన్య పరుస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా మహనీయుడి స్మారక సభ నిర్వహించడం జరుగుతుందనీ మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి మాజీ ప్రజా ప్రతినిధులు, మేధావులు, అంబేద్కరిస్టులు, విద్యార్థులు, దళిత బహుజన ప్రజా సంఘాల



అధ్యక్షులు, నాయకులు, విద్యార్థులు, యువజన నాయకులు రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘాల జేఏసీ మండల కన్వీనర్ మామిడి విజయ్, బహుజన ఉద్యమ కారుడు ఏనుగుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక




**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ లో జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు తెలిపారు.

## – అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీలకు

అక్టోబర్ నెలలో ముంబాయికి చెందిన రంగోత్సవ్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలో 55 మంది టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో కె. శిరీష ద్వితీయ బహుమతి, అనన్య ఫైవ్ స్టార్ బ్రిలియంట్ బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు 27 మంది బంగారు పతకాలు, 15 కాస్య పతకాలు, 10 రజిత పతకాలను సాధించినట్లు చెప్పారు. గ్రీటింగ్ కార్డు మేకింగ్, టాటూ మేకింగ్, హ్యాండ్ రైటింగ్, కార్టూన్ మేకింగ్, స్కెచింగ్ వంటి పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సాయిలు, కో ఆర్డినేటర్ జలీల్, ఉపాధ్యాయులు పార్థసారధి అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభకనబర్చిన విద్యార్థులకు పతకాలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

# క్షనికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కాలేజ్ గేటు నుండి ఐఎంఏ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఐఎంఏ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపాల్ జడ్జి నిర్మల గీతాంబా, సెకండ్ అడిషనల్ జడ్జి/ డిస్టిక్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ సాయి కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావులు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించడం జరిగింది. ఐఎంఏ హాల్లో నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారదా వేదిక నలంకరించిన పెద్దలందరితో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పూర్వకాలంలో కుటుంబ వ్యవస్థ సమష్టిగా ఉండడం వలన ఆ కుటుంబంలోని సభ్యులు ఎలాంటి చెడు అలవాట్లకు గురికాకుండా చూసుకునేవారని తెలిపారు.ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడికి గురి అవుతున్న వ్యక్తులు మత్తు పానీయాలకు డ్రగ్స్ కు అలవాటు పడి క్షనికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకొని ఎయిడ్స్ కు గురి అవుతున్నారని తెలిపారు. అందుకుగాను కుటుంబములోని పెద్దలు తప్పనిసరిగా వారి కుటుంబ సభ్యుల ప్రవర్తనను గమనించి వారిని సక్రమ మార్గంలో పెంచాలని, సమాజానికి హానికలుగకుండా బాధ్యత వహించాలని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలలో అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలు ఉన్నవారికి తగిన పరీక్షలు చికిత్సలు అందించి వారిని సమాజంలో మంచి పౌరులుగా జీవించడానికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా




కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా ఎయిడ్స్ నియంత్రణ కొరకు ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగస్తులకు ఎన్జీవో సంఘాల సభ్యులకు ప్రశంసా పత్రాలు అందించి సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ హరి చందర్ రెడ్డి ఎంజీఎం సూపరింటెండెంట్, డాక్టర్ లక్ష్మీదేవి సికెఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ సూర్య ప్రకాష్ సీనియర్ వైద్యాధికారి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ విజయకుమార్ , డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ వంశీకృష్ణ, ఐఎంఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజీజ్ అహ్మద్,పల్లె దావఖాన వైద్యాధికారులు, డిప్యూటీ డెమో, సిబ్బంది, వరంగల్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది డి పి ఎం సుధాకర్ డిఐఎస్ రామకృష్ణ ఎన్జీవోస్ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, వర్డ్ ట్రక్కర్స్, వర్డ్ మైగ్రేట్స్, ఆర్ డి ఎం ఎం, మారి వరంగల్, మారి టు ,కరుణమిత్ర పీపుల్స్ సొసైటీ, లింకు వర్కర్స్, వన్ స్టాప్ సెంటర్, ఎంజీఎం విద్యార్థులు మొదలగువారు పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

**వేద న్యూస్, జమ్మికుంట:** రేపు(బుధవారం) విద్యుత్ వినియోగదారుల సదస్సు జమ్మికుంట సబ్ డివిజన్ ఆఫీస్‌లో ఉదయం 10:30 నుండి 01 గంటల వరకు నిర్వహించ నున్నట్లు ఇల్లంతకుంట అసిస్టెంట్ ఇంజనీర్ సుష్మ సోమ వారం ఓ ప్రకటనతో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల పెంపుదల వినియో గదారులు, రైతులకు సంబంధించి వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేయొచ్చని పేర్కొన్నారు. సదస్సులో కన్జ్యూమర్ గ్రీవెన్స్ చైర్మన్ వేణు గోపాల చారి , మెంబర్ టెక్నికల్ ర మేష్, మెంబర్ ఫైనాన్స్ దేవేందర్, ఇండిపెండెంట్ మెంబర్ రామారావు పాల్గొంటారని వెల్లడించారు.

# నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావు ఉండకూడదు



## - కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియనుపకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని దుగ్గొండి మండలంలోని శివాజీనగర్ లతో పాటు నల్లబెల్లి మండల కేంద్రంలో, రేలకుంట, గీసుగొండ మండలంలోని కోనాయిమాకుల, మచ్చాపూర్ లలో గ్రామ పంచాయతీలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని, అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

# ఎస్ఈసీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు(ఆర్ ఓ) లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు వివిధ అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ తో కలిసి శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఆర్ ఓ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు,




ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోనేలా పీఓ లు, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్ ఓలకు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.శిక్షణలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ షరీఫుద్దీన్, నోడల్ అధికారి భారతి, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవతోనే ఆనందం



## - గంట రవికుమార్
## - పేదలకు అండగా గంట రవికుమార్ ఫౌండేషన్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**


జీఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల పేద, ఉత్తమ విద్యార్థులకు ఉచిత ట్యూషన్ తరగతులను శివనగర్‌లోని గోల్డెన్ ఓక్స్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ ఫిజీషియన్ డా. పొన్నా దశరథం, సీనియర్ జర్నలిస్టు బుదారపు శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది నాయిని అనిల్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ వైపు ప్రజా సేవ చేస్తూనే.. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గంట రవికుమార్‌కే సాధ్యమని కొనియాడారు. ఇటీవల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 528 మంది నిరుపేద విద్యార్థుల టెన్త్ పరీక్ష ఫీజును చెల్లించడం గంట సేవా తత్పరతకు నిదర్శనమన్నారు. అలాగే కరోనా సమయంలో ఎంతో మందికి ఆహారం, నిత్యావసర సరుకులు అందించారని గుర్తుచేశారు. వీటికితోడు ఏటా వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితుల బాగోగులు తెలుసుకోవడమే కాకుండా వారికి ఆహార పొట్లాలు అందిస్తున్నారని కొనియాడారు. వీటికి తోడు అతితక్కువ ఫీజులతోనే సత్యం కంప్యూటర్‌లో పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్యను, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి కల్పన అందిస్తున్న ఘనత గంట రవికుమార్‌కే దక్కిందన్నారు. ఏటా వందలాది యువకులను మోటివేషన్ చేస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతో మందికి ప్రాణదాతగా గంట రవికుమార్ ఫౌండేషన్ నిలిచిందని కీర్తించారు.

**ప్రజా సేవతోనే ఆనందం: గంట రవికుమార్**

ప్రజా సేవ చేయడంలోనే తనకు ఎంతో ఆనందం ఉందని సత్యం కంప్యూటర్స్ సంస్థల అధినేత, జీఆర్కే ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పేర్కొన్నారు. మా ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం అందించడం ముఖ్య ఉద్దేశం. తన తల్లిదండ్రులు సూచించిన బాటలోనే నడుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్టు వెల్లడించారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి ఆహార, నిత్యావసర సరుకులు అందించామన్నారు. ఏటా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ పెద్దఎత్తున రక్తసేకరణ చేయడం తనకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇస్తోందన్నారు. తాను రాజకీయాల్లో నిత్యం బిజీగా ఉన్నా సామాజిక సేవ చేయడమంటేనే ఎంతో ఇష్టమన్నారు. అవసరమైన వారికి ఎప్పటికీ తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శివనగర్ ప్రముఖులు మాజీ కౌన్సిలర్ కోటమ్మ, గజ్జెల లింగమూర్తి, గిరిప్రసాద్, రాంమూర్తి, వైట్ల గణేష్, గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ రఫీ, కందుకూరి విజయ్ కుమార్, సామల శ్రీనివాస్ వేణు, సునీల్, సతీష్, రంజిత్, కిషోర్, సురేష్, రాజ్ కుమార్, సందీప్, నాగరాజు, రాజు, శరత్ , శ్రవణ్, భాస్కర్ మరియు స్థానికలు, విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఇండ్లకి వెళ్ళే మార్గంలో వైన్ షాప్..!

## - ప్రయాణికులకు ఇబ్బందులు



**వేద న్యూస్,ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట గ్రామంలో నూతనంగా ఏర్పడిన వైన్ షాప్,నిత్యం ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. మహిళలు చిన్నపిల్లలు వెళ్లే దారి, చుట్టుపక్కల నివాసం ఉంటారు. రోడ్డు బ్లాక్ అయ్యే అవకాశం ఉంది. నిత్యం నారాయణపూర్ నుండి ఎల్లారెడ్డిపేటకు వచ్చే ప్రతి ఒక్కరూ ఇదే మార్గం నుండి రావాల్సి ఉంటుంది. ప్రతి ఆటోలు బైకులు ప్రయాణికులు ఇదే మార్గంలో నడుస్తా ఉంటారు. ప్రమాదాలు జరుగుతే ఎవరు బాధ్యులు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు పర్మిషన్ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటి, ఇక్కడే రెడ్డి సంఘం చర్చా మండలి ఉంది ఇందులో పెళ్లిళ్లు కూడా జరుగుతాయి. సమీపంలో పాలకేంద్రం కూడా ఉంది ప్రతిరోజు అక్కడికి సాయంత్రం పూట అందరూ వస్తా ఉంటారు ఎవరికైనా ప్రమాదం జరుగుతే బాధ్యత వహించాల్సింది ఎవరు, ఆప్కారి అధికారులకు, ఎమ్మార్వోకు సైతం ఫిర్యాదు చేశారు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పరిమిషన్ లేకుండా పర్మిట్ రూమ్ కూడా ఏర్పాటు చేయడం వెనకాల ఉన్నది ఎవరు, ఇక్కడ ఈ వైన్ షాప్ నడవడం వల్ల అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందువలన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనట్లయితే భవిష్యత్తులో అనేక సంఘటనలు దారి తీసే అవకాశం ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

# బెల్టు షాపులలో తనిఖీలు..ఇద్దరిపై కేసు నమోదు



**వేద న్యూస్, రుద్రూర్ :** రుద్రూర్ మండల కేంద్రంలోని బెల్ట్ షాపులలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎస్సై సాయన్న తన సిబ్బందితో అంగడి బజార్ వద్ద శేర్యాల ప్రవీణ్ గౌడ్ కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అదేవిధంగా జేయన్సీ కాలనీలో గల పెంట శివకుమార్ కు చెందిన హెటల్ లో తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

## - ఎస్పీ మహేష్ బి.గితే



**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు)పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు,సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## - ఎస్సై పి.సాయన్న



**వేద న్యూస్, రుద్రూర్:**

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై పి.సాయన్న విద్యార్థులకు సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు, నిజామా బాద్ పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబం(ఆర్) గ్రామ శివారులోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సైబర్ మోసాల పై, రోడ్డు భద్రత నియమాలు, మహిళల రక్షణ, మాదక ద్రవ్యాలు, సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాల పై విద్యార్థులకు నాటికలు, పాటల రూపంలో వివిధ సామాజిక అంశాలపై విలువైన సందేశాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళాబృందం, కళాశాల ఉపాధ్యాయుని బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**వేద న్యూస్, మహబూబ్‌నగర్ :**



## - మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దేవరకద్ర భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిని ఆదివారం కలిసి సోమవారం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మల్లెల బాలరాజునీ గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా సూచించినందుకు ఆయనను బలపరిచి నట్లు మల్లెల మీడియా ముందు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి మల్లెల బాలరాజుని గెలిపించుకొని రావాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ గౌడ్,శ్రీనివాసులు, అంజన్న, వెంకటేష్,బాలకృష్ణ, నవీన్, వేణు, పద్మ, ఝాన్సీ, రాణి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే ను పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.దేవరాజం అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో హెచ్ఐవి హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మానవులకు హెచ్ఐవి రావడానికి గల కారణాలు దాని నివారణ చర్యలు, చికిత్స విధానం గురించి వివరించడం జరిగింది. భారతదేశంలో దక్షిణాది రాష్ట్రాలైన మహారాష్ట్ర,తమిళనాడు ,కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ ,తెలంగాణ, వంటి రాష్ట్రాలలో హెచ్ఐవి వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లుగా తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ యొక్క ప్రభావం సమాజంపై ఏ విధంగా ఉంటుందనే విషయాన్ని అందులో రాబోయే భారత పౌరులుగా నేటి సమాజంలోని విద్యార్థుల పాత్ర అనే అంశాలను చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి .కుమార స్వామి, కె .లింగమూర్తి, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ జె.విజయ్, కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

## - ఎస్పీ నీతికా పంత్



**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నీతికా పంత్ అన్నారు. సోమవారం వాంకిడి అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం డబ్బు ఇతర నిషేధ వస్తువులు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. భద్రత మరింత కట్టుదిట్టం చేయాలని అన్నారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్యనారాయణ ఉన్నారు.

వేద న్యూస్

మంగళవారం, డిసెంబర్ 02, 2025

# ఆస్తుల అమ్మకం.. దేశ ద్రోహమే!

**వేద న్యూస్‌డెస్క్ :** ప్రభుత్వ పరిపాలన అనేది ప్రజలకు, అన్నిరకాల జీవరాసి మనుగడకు, రాబోవు తరాలకు సుస్థిర జీవనానికి వనరుల సంరక్షణ లక్ష్యంతో పర్యావరణహితంగా ఉండాలి. ఇటీవల జరుగుతున్న వేగవంతపు మార్పులు, తీసుకునే నిర్ణయాలు అభివృద్ధి ముసుగువేసుకొని వనరుల విధ్వంసం దిశగా పరుగేడుతోంది. ఓవైపు సహజ వనరులను కాపాడాలని, భూమిపై, సముద్రాలలో, ఆకాశంలో ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులను అదుపులో ఉంచేందుకు దేశాలు ప్రయత్నిస్తున్న సమయంలో.. అంతర్జాతీయ వేదికలపై హరిత పర్యావరణం కోసం శాస్త్రీయ దృక్పథంలో మార్పులు సంధిస్తూనే.. మరోపక్క ప్రకృతి విధ్వంసానికి అనేక రూపాలలో వివిధ వికృతాలచే అక్రమ సంపాదన, వనరులను ఒకేసారి డబ్బు రూపంలోకి మార్చేందుకు అజమాయిషీ, ఆధిపత్యాల కోసం మనిషి వివిధ మాధ్యమాలను ఉపయోగిస్తున్నాడు. అందులో పరిపాలన ముసుగులో దేశాలను వశం చేసుకునే దిశగా ముందుకెళుతూ వనరులను విధ్వంసం చేస్తూ సొమ్ముచేసుకుంటున్నాడు. ప్రజలచే ఎన్నుకున్న ప్రభుత్వం ప్రయివేటు సంస్థలతో, వ్యక్తులతో కలిసి ఏజెంట్లుగా మారి అధికారంతో వనరులను.. 'కంచే చేనుమేసిన చందంగా' బహుళజాతి సంస్థలకు దోచిపెడుతూ, దోచుకుంటుంటే ఆపాల్సింది ప్రజలే. ఎందుకంటే భవిష్యత్తులో వనరుల లేమితో సమస్యలను ఎదుర్కొనేది ప్రజలే కాబట్టి. అంతర్జాతీయంగా కూడా ఇదేపరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. భయపెట్టే సత్తా చేకూర్చుకుని బలమున్నోడిదే రాజ్యమవుతుంది.



**దేశ సంపదను కాపాడుకోవాలి**

దేశ సుస్థిరతకోసం, దేశ ప్రజల జీవన సౌలభ్యం కోసం పరిపాలన జరగాలి. అందుకోసం పాలకులు సంపద సృష్టించాలి. ఆ దిశగా దేశ ప్రణాళికల రచనలు, పరిపాలన నిర్వహణలు ఉండాలి. కానీ ఆ పరిపాలన, ప్రణాళికరచనలు కొందరికే పరిమితం కావడం, అదే దేశ అభ్యవృద్ధి అనుకోవడం మోసపురితమే అవుతుంది. సామాన్య ప్రజాజీవితాలకు భ్రమకల్పిస్తూ వారిని అంధకారంలోకి నెట్టివేసి భవిష్యత్తును నిర్వీర్యం చేయడమే అవుతుంది. దేశం వెలిగిపోతుందని ఒకరు, ప్రజాపరిపాలన అని మరొక్కరు ఇలా పరిపానను అడ్డు పెట్టుకొని జాతీయ సంపదను, జాతీయ ఆస్తులను రేపటితరాల జీవన సుస్థిరతకు తవులేకుండా, రాబోవు తరాలను అగాథంలోకి నెట్టి వేయడమే అవుతుంది. పర్యావరణ సమతుల్యతకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యంలోని లొసుగులను అదునుగా చేసుకొని నిధులను ఇతరులకు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసం, ఆచరనీయం? ఇప్పటికే ప్రకృతి అనేక విపత్తులను పరిచయంచేస్తూ హెచ్చరిస్తూనే ఉన్నది. అయినా ఇలా తెలిసి విపత్తులను అనుభవిస్తూ సహజ వనరులను, జాతీయ సంపదను లూటి చేయడం, భవిష్యత్తును తెలిసి చెరపట్టడమే అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు దేశ ఆస్తులను, సహజవనరులను ప్రజా అవసరాలకు మించి కోళ్లగొట్టడం ఆపివేయకపోతే దేశ



భవిష్యత్తు అంధకారమే. సంపదను సృష్టించుకుంటూ, ఉన్న దేశ సంపదను కాపాడుకునే దిశగా ఆలోచించు కోవాలి.

**బ్రెజిల్‌లో బయోఎకానమీ**

బ్రెజిల్.. అమెజాన్ అడవులను కాపాడుతూ, ఆదివాసీల ఉపాధిని పెంచడానికి, మైనింగ్‌పై ఆధారపడకుండా 'బయో ఎకానమీ' అనే సుస్థిర ఆర్థిక నమూనాను అభివృద్ధి చేస్తోంది. వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి, జీవారణ్యాల మనుగడ మానవ మనుగడకు అత్యవసరం అని బ్రెజిల్ చాటి చెబుతోంది. దీనికి విరుద్ధంగా.. భారతదేశంలో 2024-2025లో తీవ్ర వాతావరణ పరిస్థితులు నమోదయ్యాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల వల్ల అసంఘటిత రంగ కార్మికుల్లో 60 శాతం మంది ఆదాయం కోల్పోయి, ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. వాయు కాలుష్యం (ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరం), విష రసాయనాలు పీల్చడం వలన ప్రజలు శ్వాసకోశ, గుండె, క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ఇక్కడ 'మంచి గాలి' ఒక లగ్జరీ వనరుగా, వ్యాపారంగా మారింది. భారత్ ప్రస్తుతం 'విధ్వంసకర, వినాశకర వికాసం' దిశగా ప్రయాణిస్తోంది. దేశ కార్బన్ ఉద్గారాలను స్వీకరించే దండకారణ్యం బొగ్గు, బాక్సైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం వల్ల తీవ్ర ప్రమాదంలో పడింది. కార్పొరేట్ మైనింగ్‌ను ప్రతిఘటిస్తున్న ఆదివాసీ ఉద్యమాలను అణచివేయడం, దేశ సంపదను ధ్వంసం చేయడం పరిపాలనా ధర్మానికి విరుద్ధం. ప్రపంచ సంతోష నివేదిక-2025లో భారత్ 118వ స్థానంలో ఉండడం, ప్రజల్లో విద్య, వైద్యం, స్వచ్ఛమైన వనరుల పట్ల ప్రభుత్వ మద్దతు లేదనే అసంతృప్తిని సూచిస్తోంది. ప్రభుత్వాలు తక్షణమే మేల్కొని, రాజ్యాంగం అందించిన జీవించే హక్కును విస్తృతంగా అమలు చేయాలి. కార్పొరేట్లను నియంత్రించి, ప్రజల ప్రయోజనాలను పరమార్థంగా పాలన సాగించాలి. కాలుష్య నియంత్రణలో చైనా విధానం, జీవ ఆర్థిక వ్యవస్థలో బ్రెజిల్ విధానం ఆదర్శంగా తీసుకుని, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి, అడవుల పెంపుదలను అమలు చేయాలి. పౌర సమాజం అప్రమత్తతతో, ప్రజాస్వామిక పోరాట రూపాలతో ఈ పర్యావరణ వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉంది. భూమిపై సకల జీవరాసులకు సమానంగా జీవించే హక్కువున్నది. ఒక్క మానవునికి మాత్రమే ఈ భూమి సొంతం కాదు అనే దృష్టితో ప్రభుత్వాలు పాలన సాగించాలి. పాలకుల విధానం దేశ అభివృద్ధికి, సుస్థిర ప్రజా జీవన, జీవమనుగడదిశకు పర్యావరణ సుస్థిరతకు అనుకూలమై ఉండాలి. అప్పుడే జాతీయ సహజ సంపదలైన అటవీ సంపద, దేశ భూములు, సహజవనరులు దేశ ఆస్తులుగా అందరికీ సుస్థిర పరిపాలన ఫలాలుగా అంది భవిష్య మానవ, ఇతర జీవరాసి సుగమ జీవనానికి బాటవేసి బాసటగా పాలన నిలుస్తుంది.

– రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త కార్యదర్శి.

## డీసీసీ అధ్యక్షులు కాటిపల్లి నగేష్ రెడ్డికి సన్మానం



**వేద న్యూస్ రుద్రూర్ :**

నూతన డీసీసీ అధ్యక్షులుగా ఎన్నికైన కాటిపల్లి నగేష్ రెడ్డిని, నిజామాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణని, మాజీ డీసీసీ అధ్యక్షులు మానల మోహన్ రెడ్డిని సోమవారం బాన్సువాడ బ్లాక్ (బి) కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్ర శేఖర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, హనుమకొండ :**

ప్రతిమ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఆధ్వ ర్యంలో డాక్టర్ సుమిత్రా తిప్పని శ్రీ చైతన్య సీబీఎస్ ఈ పాఠశాలలో పిల్లలకి క్యాన్సర్ పై అవగాహన సదస్సుని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెరుగుతున్న క్యాన్సర్ రావడానికి కారణమైన హెచ్ పీ వి వైరస్ గురించి వివరిస్తు క్యాన్సర్ రాకుండా ఉండడానికి తగు జాగ్రత్తలను విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి , డీన్ కర్ణాకర్ , ప్రైమరీ ఇన్చార్జ్ షాహిన్ ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రావణి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవం అయ్యేలా చేయండి..!

– ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వేద న్యూస్,శాయంపేట:**

సర్పంచ్ ఎన్నికల్లో శాయంపేట మండలంలో వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలోని ఎస్ వీ కే కే వేడుకల మందిరంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో జరిగిన సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకోవాలని, వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు వచ్చిన గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడైనా ఆర్థికంగా బలహీనంగా ఉంటే, ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆ అభ్యర్థి విజయానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను, నాయకులను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టుకుని గెలిపించుకుని రావాలని పిలుపునిచ్చారు

## బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో సోమవారం జెడ్ పీ హేచ్ ఎస్ పాఠశాలలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగింది.దీనిలో భాగంగా , మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది హేమశ్రీ, మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేసారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు తల్లులకు,కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి, బాల్య వివాహాలు చేసుకున్నట్లయితే ఎలాంటి శిక్షలు పడతాయో వారికి వివరించి చెప్పడం జరిగింది. అదేవిధంగా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181, జాతీయ అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్ 112, అత్యవసర వైద్య హెల్ప్ లైన్ నెంబర్108, ఆపదలో ఉన్న అమ్మాయి హెల్ప్ లైన్ నెంబర్ 8712670783,సైబర్ నేరాలు హెల్ప్ లైన్ నెంబర్ 1930, దివ్యాంగుల హెల్ప్ లైన్ నెంబర్ 155326, వృద్ధుల హెల్ప్ లైన్ నెంబర్ 14567 లా గురించి అవగాహన కల్పించడం జరిగింది.బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు ప్రతిజ్ఞ కూడా చేయడం జరిగింది. ఈ



కార్యక్రమంలో మహిళా సాధికారత సిబ్బంది హేమశ్రీ, చైల్డ్ హెల్ప్ లైన్ శ్రీకాంత్,ఎం ఎల్ హేచ్ పి గణేష్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి రాజేందర్,పాఠశాల బృందం, తల్లులు కిశోర బాలికలు గ్రామ ప్రజలు, అంగన్వాడీ టీచర్స్ ,ఆశా కార్యకర్తలు, పాల్గొనడం జరిగింది. అదేవిధంగా విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది.

## బీఆర్ఎస్ లోకి చేరికలు



**వేద న్యూస్, మహబూబ్ నగర్:**

పెబ్బేరు మండలం పాత పల్లి గ్రామము నుండి ఎనుముల చైతన్య భారతి ఆధ్వర్యములో కాంగ్రెస్ పార్టీ నుండి 50మంది మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బిఆర్ యస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా చైతన్య భారతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మాకు ఎటువంటి అభివృద్ధికాని,వ్యక్తిగత పనులు కూడా జరగలేదని అందుకే బిఆర్ ఏస్ పార్టీతో అభివృద్ధి సాధ్యం అని నమ్మి పార్టీలో చేరుతున్నాం అని చైతన్య భారతి అన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గతములో పాతపల్లి గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టీ అభివృద్ధి చేశామని నాపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ నుండి వచ్చినందుకు మీకు అండగా ఉండి మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఐకమత్యంతో గ్రామ సర్పంచిగా చైతన్య భారతిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,నందిమల్ల అశోక్,ఆవుల రమేష్,చిట్యాల రాము గ్రామ నాయకులు వెంకటయ్య గోవిందు, ఎం.నాగేష్, కరుణాకర్, శ్రీని వాసులు,ఆశన్న,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు





**వేద న్యూస్, వనపర్తి :**

పిన్నచర్ల,మూలమళ్ళ, బాలకిష్టాపూర్, ఆరెపల్లి, తూంపల్లి గ్రామాల సర్పంచ్ అభ్యర్థులుగా భారతీయ జనతా పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేయటం జరిగింది. మూలమల బిజెపి అభ్యర్థిగా విష్ణువర్ధన్ రెడ్డి, బాలకృష్ణ పురం బిజెపి అభ్యర్థిగా మస్సన, పిన్నించర్ల బిజెపి అభ్యర్థి గా లక్ష్మి, తూంపల్లి బిజెపి అభ్యర్థిగా పరశురాములు, ఈ నామినేషన్ల కార్యక్రమానికి బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు, ముదిరాజ్ ఆత్మకూరు మున్సిపల్ అధ్యక్షుడు సూరి, బిజెపి జిల్లా నాయకులు ఆనంద్, బిజెపి మాజీ అధ్యక్షుడు తంబలి విజయ్ వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు ఐడి ఉంది.. ఓటు లేదు..!

**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**



సిర్పూర్ టీ మండలం హుడ్కిలి గ్రామ పంచాయతీ పరిధిలోని మాకిడి గ్రామానికి చెందిన తాడే నళిని కి ఓటరు కార్డు ఉంది కానీ ఓటరు లిస్ట్ లో పేరు లేదని వాపోయారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ లిస్టులో పేరు ఎలా తొలగించారు తనకి తెలీదని తనకి సమాచారమే లేదన్నారు. గ్రామపంచాయతీలో సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీ మహిళ వచ్చిందని ఈ అవకాశాన్ని తాను సద్వినియోగం చేసుకోవడానికి తను సర్పంచ్ గా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తనకు ఓటరు కార్డు లేకున్న తనకి అవకాశం ఇవ్వాలని తన నామినేషన్ రిజెక్ట్ చేయకుండా చూడాలని వేడుకున్నారు.

వేద న్యూస్

మంగళవారం, డిసెంబర్ 02, 2025

# కాసిపేటలో నామినేషన్ల వెల్లువ

**- 37 సర్పంచ్, 74 వార్డు స్థానాలకు దరఖాస్తులు**



**వేద న్యూస్,కాసిపేట:**

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం కాసిపేట మండలంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఊపందుకుంది. ఎన్నికల కేంద్రాల్లో అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యడంతో మండల పరిధి ఎన్నికల సందడితో మారుమోగుతోంది. అధికారుల సమాచారం ప్రకారం, ఇప్పటి వరకు మండలంలో 37 సర్పంచ్ స్థానాలకు 74 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. కొన్ని గ్రామాల్లో పోటీ హెూరాహెూరీగా మారుతుండగా, మరికొన్ని గ్రామాల్లో ఇంకా పరిస్థితి స్పష్టత చెందాల్సి ఉంది.మరోవైపు మండలంలోని పలు నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ముగింపు తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో అభ్యర్థుల రద్దీ మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఎన్నికల వేడి ఊపందుకున్న కాసిపేట మండలంలో గ్రామాల వారీగా రాజకీయ సమీకరణలు మారుతున్న నేపథ్యంలో, నామినేషన్ల ప్రక్రియ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# జైత్‌పూర్ జీపీ 4వవార్డు సభ్యుడిగా జబొరె మహేశ్ ఏకగ్రీవం

**- ప్రజల తరఫున ప్రశ్నించే గళంగా యువనేత**



**వేద న్యూస్, ఆసిఫాబాద్:**

యువత రాజకీయాల్లో రాణించాలంటే వారికి ప్రజల మద్దతు అత్యంత కీలకం. అందులో ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండి.. పరిష్కారానికి పని చేసే నాయకుల కు సపోర్టు చేయడం అత్యంత ఆవశ్యకం. కాగా, ఆ కోవకు చెందిన యువనాయకుడిగా ఉన్న జబొరె మహేశ్ కు జనం మద్దతుగా నిలిచారు. జైత్ పూర్ గ్రామ పంచాయతీలోని 4 వ వార్డు సభ్యుడిగా గ్రామానికి చెందిన యువ నాయకుడు జబొరె మహేష్ బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యల పట్ల అవగాహన ఉన్న యువకుడైన మహేశ్ ను వార్డు సభ్యుడిగా గెలిపించాలని భావించాలని ప్రజలు ఆయన్ను ఏకగ్రీవం చేశారు. గ్రామంలోని పలు సమస్యలను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేసిన అనుభవం, నేర్పరితనం యువకుడు మహేశ్ కు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. నిత్యం సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు వెళ్లి ఉన్నతాధికారులతో మాట్లాడగలిగే చొరవ, అనుభవం ఉన్న మహేశ్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు వెళ్లాలంటే.. ఆయనకు అందరి మద్దతు అవసరం అని అంటున్నారు.

# గ్రామాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తా

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



**- బిఆర్ఎస్ అభ్యర్థి వల్లంపట్ల లక్ష్మమ్మ**

ఆమనగల్ గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు సహకారం తో అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వల్లంపట్ల లక్ష్మమ్మ అన్నారు. సోమవారం ఉదయం ఆమె టిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున నామినేషన్ దఖల్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదు కుంటానని చెప్పారు. ఆమనగల్ గ్రామంలో పారదర్శక పాలన అందిస్తా నని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మాజీ సర్పంచ్ పేరాల కృపాకర్ రావు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ మాజీ అధ్యక్షులు కోల పాపయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

**- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సందీప్ నాయుడు**



**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఆమనగల్ గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పిల్లల సందీప్ నాయుడు అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. సామాన్య ప్రజల కోసం అండగా ఉంటానని అన్నారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా పారదర్శక పాలన అందిస్తానని తెలిపారు. అంతకుముందు గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులతో పెద్ద ఎత్తున నామినేషన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బంటు చొక్కయ్య గౌడ్, మాజీ సర్పంచ్ వల్లంపట్ల ఝాన్సీ ప్రవీణ్, ఆమనగల్ దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఎలగపల్లి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయానికి వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా..

**అమరావతి వేద న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. అల్లూరి జిల్లా అంగళూరు వద్ద గండిపోచమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా పాలకొల్లుకు చెందిన 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి నిమ్మల రామ్మోహన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రత్యేక వాహనాల్లో క్షతగాత్రులను పాలకొల్లు పంపాలని సూచించారు.

# పోలీస్ కిష్టయ్య జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

**వేద న్యూస్, హనుమకొండ :**



తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ 16 వ వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు జవహర్ నగర్ సెంటర్, ఎన్జిఓఎస్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన అనంతరం కిష్టయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... తెలంగాణ అమరవీరులను ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో నష్టపోయిన యువతకు ప్రభుత్వం అండగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్, మట్టపల్లి సాంబయ్య, కేశబోయిన కోటేశ్వర్ ముదిరాజ్, మత్స్యశాఖ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, మట్టపల్లి జగన్, చిరబోయిన అంజన్ రావు ముదిరాజ్, ప్రశాంత్, రాజు, బండి శ్రీను, జనగాం శ్రీను, రామకృష్ణ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కాసిపేటలో సర్పంచ్ ఎన్నికల సందడి

**- గ్రామాలలో రాజకీయ వాతావరణం వేడెక్కింపు**

**వేద న్యూస్,కాసిపేట:**




సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కాసిపేట మండలంలో రాజకీయ వేడి మరింతగా రాజుకుంది. గ్రామాల వారీగా నాయకులు, అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు తమ తమ వర్గాల బలాన్ని అంచనా వేసుకుంటూ వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. అభ్యర్థుల ఎంపిక, సమీకరణల ఏర్పాటు, గ్రామస్తుల మద్దతు పొందేందుకు జరుగుతున్న కసరత్తులతో మండలమంతా ఎన్నికల హెూరాహెూరీకు సిద్ధమవుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో మళ్లీ పోటీ రంగం మారుతుండగా, కొన్నిచోట్ల పాత ప్రత్యర్థులు మళ్లీ ఎదురెదురుగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. స్థానికంగా గ్రామాల సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాలు వంటి అంశాలు ఎన్నికల ప్రధాన ఎజెండాగా మారాయి. అభ్యర్థుల నామినేషన్‌ల దాఖలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు పెద్ద సంఖ్యలో సర్పంచ్ స్థానాలకు దరఖాస్తులు రావడం రాజకీయ ఉత్సాహాన్ని మరింత పెంచింది. నామినేషన్ కేంద్రాలు అభ్యర్థులు, వారి అనుచరులు, రాజకీయ నాయకుల రాకపోకలతో మారాయి.మండలంలోని ప్రతి గ్రామంలో సర్పంచ్ పోటీపై ప్రజల్లో ఆసక్తి గణనీయంగా పెరిగింది. అభ్యర్థుల బలహీనతలు, బలాలు, సామాజిక సమీకరణలు, సంప్రదాయ వర్గ బలం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. మరోవైపు గ్రామాల్లో రహస్య సమావేశాలు, వర్గాల కలయికలు కూడా జోరందుకోవడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది.ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ ప్రచార తీరులు, అభ్యర్థుల వ్యూహాలు, గ్రామాల్లో జరుగుతున్న చర్చలు ఆసక్తికర మలుపులు తిరగనున్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్వరలో సర్పంచ్ పోటీ పూర్తి స్థాయిలో హెూరాహెూరీ రూపం దాల్చనుంది.

# బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలి

**- నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు**



**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

సర్పంచ్ ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్, ఆసిఫాబాద్ మాజీ జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని రాజుర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొట్టుపల్లి గోపాల్ తన అనుచరులు, గ్రామస్తులతో కలిసి ఆరిగేల నాగేశ్వరరావు సమక్షంలో బిజెపిలోకి చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన 200 మంది బీజేపీ లోకి చేరారు. వీరికి అరిగేలా నాగేశ్వరరావు బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మోతుగూడ గ్రామ పంచాయతీలో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్తి బొట్టుపల్లి గోపాల్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఇది వరకు రాజుర లో బీజేపీ పార్టీ అనేక సమస్యలను పరిష్కరించిందని భవిష్యత్ లో కూడా సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరిగేలా మల్లికార్జున్, నాయకుడు ప్రసాద్, దీపక్, రాజుర గ్రామస్తులు సాంబయ్యా,గుణవంతురావు, రమేష్, మోహన్, శ్రీకాంత్, వసంత్ , ఆత్మరాం, మోహన్, మోతుగూడ గ్రామస్థులు గంగన్న, నగేష్, నరేష్, పవన్ లు తదితరులు ఉన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వ కట్టుబాటు పునరుద్ఘాటన

- **లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**
- **టెక్కలిలోనే 208 మంది పేదలకు రూ.2.10 కోట్ల సహాయం**
- **జనవరి 2026 నుంచి రూ.25 లక్షల వైద్య బీమా అమలు**
- **మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి వేద న్యూస్ :**

పేద ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కూటమి ప్రభుత్వం ఆ దిశగా స్పష్టమైన సంకల్పంతో ముందుకు సాగుతోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదా రులకు చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజల వైద్య చికిత్సకు ఆర్థిక అండగా ఈ నిధి కీలక పాత్ర పోషిస్తోందని ఆయన చెప్పారు. ఒక్కరోజులోనే 35 మంది లబ్ధిదారులకు రూ. 26,86,327 విలువైన చెక్కులను అందజేయడం జరిగినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యసహాయం అందిస్తున్న ప్రమాణం గణనీయంగా పెరిగిందని అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 208 మంది పేద రోగులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా దాదాపు రూ. 2.10 కోట్లు మంజూరు చేయడం ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న మనసుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ స్పందన వేగంగా, పారదర్శకంగా ఉండడంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోనుంచి బయటపడుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. పేద మరియు మధ్యతరగతి ప్రజల వైద్య అవసరాల్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో పేదలకు వైద్య భద్రతను మరింత బలపర్చే చారిత్రక నిర్ణయం తీసుకున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. వచ్చే జనవరి 2026 నుంచి పేద కుటుంబాలకు రూ. 25 లక్షల వరకు వైద్య బీమా సౌకర్యం అమలులోకి రానుందని వెల్లడించారు. ఇప్పటివరకు అమలులో ఉన్న పరిమితి కంటే ఇది భారీ పెంపు కావడంతో వేలాది కుటుంబాలకు పెద్ద స్థాయిలో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఎవ్వరూ ఇబ్బంది పడకూడదన్న ధృఢ సంకల్పంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పేదల వైద్య సహాయాన్ని కూడా దోచుకున్న పరిస్థితులు ప్రజలు చూశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. అక్రమాలు, అవినీతి, నిధుల దుర్వినియోగం కారణంగా అనేక నిజమైన లబ్ధిదారులు నష్టపోయారన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తూ, పదేపదే వైద్య సహాయాన్ని అందిస్తూ తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు ఆయన తెలిపారు. కూటమి పాలన అంటే పేదల సంక్షేమమే ధ్యేయం అని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అందుకు నిదర్శనమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073